క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించకుంటే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపలక్ష్మి, జిల్లా నాయకులు మెస్రం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

సిరికొండ: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో ఉంటూ సన్మార్గంలో నడవాలని సంత్ శ్రీ నారాయణ్ మహరాజ్ భక్తులకు ప్రవచనాలు బోధించారు. మంగళవారం మండలంలోని రాజంపేట్ గ్రామంలో గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న సప్తాహ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'హీరాసుక ఆశయాలు కొనసాగించాలి'

ఇచ్చోడ: హీరాసుక ఆశయాలను కొనసాగించే విధంగా ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ప్రధాన్ సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక సుదర్శన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ నగర్‌లో హీరాసుక జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి యువత హీరాసుక ఆశయాలను కొనసాగించే విధంగా ప్రత్యేక కృషి చేయాలని కోరారు. ఆదివాసీ సంఘాలను కలిసికట్టుగా ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. నాయకుల కోటేశ్వర్, బలిరాం, రమేశ్, మధుకర్, నగేశ్, కల్పన పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఆదిలాబాద్‌టౌన్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పనిచేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు దయాకర్ అన్నారు. కంది కొనుగోళ్లలో పరిమితి పెంచడంలో ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంది పంటను 3క్వింటాళ్ల 30 కిలోల వరకే కొనుగోలు చేస్తుండగా, పరిమితి పెంచేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారన్నారు. దీంతో 6 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచారన్నారు. బీజేపీ నాయకులు మయూర్ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

సిరికొండ: మహిళలకు ఆర్థిక అక్షరాస్యతతో పాటు అవగాహన ఎంతో అవసరమని ఐకేపీ జిల్లా మేనేజర్ హేమలత అన్నారు. నారీ శక్తి మణి కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలం కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎంలు శోభారాణి, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీరాంపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్తులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా 137 మంది లబ్ధిదారులకు నూతన ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణంతో పాటు నమూనాపై వివిధ అంశాలపై లబ్ధిదారులకు ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శంకర్, ఏఈ నజీర్, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, ఆర్ఐ రాందాస్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, యువతులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని ముందుకు సాగాలని మహిళ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై అనిత అన్నారు. జిల్లా మహిళ సాధికార కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులను మంగళవారం మహిళ పోలీస్‌స్టేషన్ సందర్శన చేపట్టారు. పోలీసుల విధులు, రిపోర్టు ఎలా చేయాలి, పోలీసుల సహాయం ఏ విధంగా తీసుకోవాలి.. మహిళల భద్రతకు సదుపాయాలు, డయల్ 100, పిటిషన్ ఎంక్వైరీ ప్రాసెస్, ఎఫ్ఐఆర్‌పై వివరించారు. అదేవిధంగా సఖీ కేంద్రంలో షెల్టర్, కౌన్సెలింగ్, పారామెడికల్ సేవలపై తెలియజేశారు. సఖీ సిబ్బంది సరస్వతి, జిల్లా సాధికారత కేంద్రం నిర్వాహకురాలు యశోద, కోటేశ్వర్, నిఖిలేశ్వర్ ఉన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన..!

- ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట
- కనిపించని ప్రత్యేక అధికారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నార్నూర్: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలు అప్పగించడం.. వారు చుట్టపుచూపుగా పల్లెల్లో పర్యటిస్తుండటంతో పల్లెల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీలు, చేతిపంపులు మరమ్మతులకు నోచుకోకపోవడం, పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు సతమతమవుతున్నారు. నార్నూర్ మండలంలో 23, గాదిగూడ మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈఏడాది జనవరి నెలాఖరుకు పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఒక్కో అధికారి మూడు, నాలుగు పంచాయతీల్లో పాలనను పర్యవేక్షించడం సాధ్యం కావడంల ఏదు. కనీసం వారానికోసారైనా ఆయా గ్రామాల్లో వారు పర్యటించలేకపోతున్నారు. దీనికి తోడు వారు తమ సొంత శాఖ విధులు సైతం నిర్వర్తించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులతో సమీక్షలు, సమావేశాలకు నిత్యం హాజరుకావాల్సిన పరిస్థితి వారిది. దీంతో కొంతమంది సాకులు చెప్పి విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొందరు ప్రత్యేక విధుల పేరిట పూర్తి సమయం కేటాయించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యల చిట్టా..

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్‌లు చాలాచోట్ల లీకై నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పాడైన బోర్లను బాగు చేయించేవారు కరువయ్యారు. నీళ్లు పోయక హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సరీల సంరక్షణ సక్రమంగా సాగడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు దాదాపు కొన్నినెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు రెండు నెలలకోసారి మంజూరవుతున్నా సరిపోక పంచాయతీలకు ఇక్కట్లు తప్పడం లేదు. పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు పట్టించుకోవడం లేదు. నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గొండుగూడ, కొలాంగూడ గ్రామాల్లో నీటి కొరత అధికంగా ఉంది. నార్నూర్, కొత్తపల్లి-హెచ్, భీంపూర్ తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పల్లెప్రకృతి వనాలకు నీళ్లు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. గాదిగూడ మండలంలోని బొజ్జుగూడ, రుప్పాపూర్, రాంపూర్, కునికాసా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడం లేదు. దీంతో ప్రైవేట్ బోర్‌వెల్‌ను ఆశ్రయించి గిరిజనులు తంటాలు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకుండా ఉండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల సమస్యలపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.


గాదిగూడ మండలం బొజ్జుగూడలో పని చేయని తాగునీటి చేతిపంపు

అధికారులతో సమన్వయం చేస్తున్నాం..

ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేకాధికారులు పర్యటించేలా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై దృష్టి సారిస్తాం.
– ప్రభాకర్, డీఎల్‌పీవో, ఉట్నూర్

భూసారం పెంచేందుకు కృషి

ఇంద్రవెల్లి: వ్యవసాయ భూముల్లో భూసారం పెంచేందుకు కాటన్ గురు మహా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తన్మయ్ దాగా, రాజేందర్ కాప్సేలు అన్నారు. మంగళవారం మండలంలోని పలువురు రైతుల వ్యవసాయ చేనుల్లో పత్తి కట్టెలు కాల్చడం ద్వారా వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. సంస్థ ఆధ్వర్యంలో క్వాంటికి యంత్రాలు ఏర్పాటు చేసి పత్తి కట్టెలు కాల్చారు. కాల్చిన తరువాత పత్తి కట్టెల బొగ్గును సేకరించారు. పత్తి కట్టెలను కాల్చడం ద్వారా భూమిలో పోషకాలు నశిస్తాయన్నారు. సేకరించిన బొగ్గును సేంద్రియ ఎరువుగా తయారు చేసి రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. సంస్థ సిబ్బంది వశిష్ట, పోశెట్టి, కమలాకర్, జోసెఫ్, రైతులు తదితరులు ఉన్నారు.


యంత్రం ద్వారా పత్తి కట్టెలు కాలుస్తున్న నిర్వాహకులు

'ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించాలి'

నార్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు జ్ఞానేశ్వర్, శ్యామ్‌రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం


పత్తిలోడ్‌తో బోల్తాపడిన ట్రాక్టర్

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మంగళవారం మండలంలోని ఇంద్రవెల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన మెస్రం మారుతి అనే రైతు ట్రాక్టర్‌లో పత్తిలోడ్‌తో మార్కెట్‌కు వెళ్తుండగా గుంతల మయంగా మారిన రోడ్డులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బొల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ సోయం సురేశ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని రైతు తెలిపాడు.

నందీశ్వర జాతర ప్రారంభం

బేల: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని బాది గ్రామ శివారులో గల నందీశ్వర ఆలయ ఆవరణలో మంగళవారం జాతర ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ఆరోహన చేపట్టారు. నందీశ్వర విగ్రహానికి గంగజలంతో జుగ్నాక్ వంశీయులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

అంకటేశ్వర స్వామి జాతర..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకాపూర్ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం అంకటేశ్వర స్వామి జాతర ప్రారంభమైంది. మహాశివరాత్రి ముందు రోజు నుంచి భజనలు, కీర్తనలు, జాగారం చేస్తుంటామని భక్తులు పేర్కొంటున్నారు. జాతరలో మొదటి రోజు పందిరిలోద్ది గ్రామ భజన మండలి భక్తి కీర్తనలతో జాతర ప్రారంభించారు. ఈ జాతర మార్చి 3 వరకు ఐదు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. జాతర సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ఆదిలాబాద్‌రూరల్: భజనలు చేస్తున్న భక్తులు

వైభవంగా పార్వతి పరమేశ్వరుల కల్యాణం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ గంగపుత్ర శివాలయంలో మంగళవారం శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా సాగింది. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

శివమార్కండేయ ఆలయంలో..

బోథ్: మహా శివరాత్రి పురస్కరించుకుని బోథ్ పట్టణ కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బాల్య వివాహాలు నేరం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు అనే అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ప్రిన్సిపాల్ లలిత కుమారి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీశ్, షూర్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ వినోద్, చైల్డ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం'

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా ప్రభుత్వం, ఇన్‌చార్జి మంత్రి స్పందించకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సాజిదొద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సలీంపాషా, అథురుల్లా, తిరుపతి, సలీం, జహూర్, ముఖీబ్, ఫేరోజ్, అయ్యూబ్, పర్వీన్ సుల్తాన, కరుణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో ఒకరు మృతి

ఇంద్రవెల్లి: జ్వరంతో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామానికి చెందిన వాగ్మరే సుర్యకాంత్(56) జ్వరంతో బాధపడుతూ 10 రోజుల క్రితం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి టైఫాయిడ్‌గా నిర్ధారించి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య గౌడన్‌బాయి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నేరడిగొండ: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తేజాపూర్ పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి అన్నారు. మంగళవారం మండలంలోని తేజాపూర్ గ్రామ పరిధిలోని తేజాపూర్ కాలనీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, ఆశ కార్యకర్త భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని సిరికొండ గ్రామంలో కుమురం భీం క్రికెట్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగదీష్, భూమన్న, రమణ, సంటి బాపు, గంగయ్య యాదవ్, అంకోలి గ్రామ పటేల్ పురుషోత్తం, ఎర్రం నర్సింగరావు, సిరికొండ గ్రామ పటేల్ సొంజీ, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

కైలాస్‌నగర్: ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేస్తానని సీఎం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముదిరాజ్ మహాసభ సీనియర్ ఉపాధ్యక్షుడు అందే బాబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పలు హామీలు ఇచ్చినప్పటికీ వాటిని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అఖిలభారత కోలి సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు బుజ్జ నారాయణ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దారవేణి రాము, దార్ల రవి, కోశాధికారి బొజ్జ సంతోష్, లక్ష్మన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండ గోవర్దన్‌కు సన్మానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతిశాస్త్రం బోధించే అధ్యాపకుడు కొండ గోవర్దన్‌కు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, సిబ్బందితో కలిసి శాలువాతో సన్మానించారు. గోవర్దన్ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో పొలిటికల్ పార్టిసిపేషన్ అండ్ పొలిటికల్ అవెర్నస్ ఆఫ్ గ్రాస్‌రూట్స్ లెవెల్ లీడర్ షిప్ ఇన్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందినందున ఆయనను సన్మానించారు. అధ్యాపకులు సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, సోమన్న, రాజేశ్వర్, బాలాజీ, నాగభూషణ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేదం పాఠశాలలో విజ్ఞాన మేళా

బోథ్: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజ్ఞానమేళా నిర్వహించారు. విజ్ఞాన మేళాలో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు రూపొందించి వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ సుభాష్ చందర్, సీఐ వేంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భజన పోటీల్లో కరంజి(టి)కి మొదటి బహుమతి

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామ భజన బృందం సభ్యులు మొదటి బహుమతి సాధించారు. తలమడుగు మండలంలోని ఝరి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని భజన పోటీలు నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజామున వరకు నిర్వహించిన పోటీల్లో 10కి పైగా గ్రామాలకు చెందిన భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. కరంజి(టి) గ్రామానికి చెందిన గురుదత్త భజన మండలి మొదటి బహుమతి రూ.11వేలు, జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామ మండలికి రెండో బహుమతి రూ.7వేలు అందించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సిల్వర్ అశోక్, పొచ్చన్న, గణేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రిమ్స్‌ను సందర్శించారు. సదరం శిబిరం ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, సర్టిఫికెట్లకు సంబంధించి ప్రభుత్వం మరో 21 అంశాలను జోడించిందని పేర్కొన్నారు. అర్హులందరికీ సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. త్వరలో ఆయా విభాగాల వైద్యులతో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిమ్స్‌లో నిర్మిస్తున్న క్రిటికల్‌కేర్ యూనిట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఏసీడీఓ మిల్కా, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ తదితరులున్నారు.


రిమ్స్ డైరెక్టర్, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ఆదిలాబాద్: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతులు, మహిళలు ఆర్థిక అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పొదుపుతో పాటు బ్యాంకు ద్వారా ఆర్థిక సాధికారత సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఎల్డీఎం ఉత్పల్ కుమార్, టీజీబీ రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సినీ, జానపద గీతాలపై వేసిన స్టెప్పులు ఉర్రూతలూగించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీఐఈవో రవీంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ జాదవ్ గణేశ్ కుమార్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బేల కళాశాలల ప్రిన్సిపాళ్లు సూర్యప్రకాశ్, భగవాండ్లు, లెక్చరర్లు సూరజ్ సింగ్, మాధురి, ఉమాదేవి, రాధ, సుప్రియ, శైలజ, ప్రేమ్‌చందర్ రెడ్డి, సాగర్, ఐలయ్య, సుదర్శన్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు రమణారెడ్డి, దేవేందర్, శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

'నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా మంగళవారం మావల మండల కేంద్రలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను కలుసుకుని నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు అడెల్లు, లక్ష్మన్న, దినేశ్ తదితరులు ఉన్నారు.

బోథ్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి అన్ని వర్గాల మేధావులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం బోథ్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు గొర్ల రాజు యాదవ్, గడ్డల నారాయణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలి..

కైలాస్‌నగర్: పేదప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

తలమడుగు: పట్టభద్రులు నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవపూర్, భరంపూర్ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. బొల్లారపు బాబన్న, కల్యాణం రాజేశ్వర్, వెంకన్న యాదవ్, తిరుపతి, కే.ప్రతాప్, పోశెట్టి పొట్నా నర్సయ్య, బాబురావు, నర్సింలు, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

'మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి'

ఆదిలాబాద్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర్య అభ్యర్థి మంచికట్ల ఆశమ్మ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తనను గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పద్మశాలీ సంఘం నాయకులు పెంట వెంకన్న, మధు, రమేశ్, సందీప్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంచికట్ల ఆశమ్మ

'కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం'

ఉట్నూర్‌రూరల్: అన్ని వర్గాలకు సమ న్యాయాన్ని చేకూర్చేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విజయోత్సవ సభ మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. చైర్మన్ రాకతో మాదిగ కులస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, లోక్ సాహిర్ అన్న బాహుసాతే, బాబు జగ్జీవన్ రాం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పుచప్పుళ్లతో సభ ప్రాంగాణానికి చేరుకున్నారు. ఎస్సీ సెల్ నాయకులు చంద్రయ్య, లాజర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నార్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సందర్భంగా జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కోరళ్ల మహేందర్ సన్మానించారు. నాయకులు బిరుదుల లాజర్, అరికెల అశోక్, పరమేశ్వర్, జిల్లపల్లి సుకుమార్, పాముదారి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

విద్యార్థులకు కంటి పరీక్షలు

నార్నూర్: మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు మంగళవారం వైద్యురాలు సంధ్యారాణి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్బీఎస్కే వైద్యురాలు రాజమణి, హెచ్ఈఓ తులసిదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ ఉన్నారు.